# అంచనా

"ఓ! గాడ్... వాట్సిట్" కారు దిగి వస్తూ ఇంట్లోకి అడుగు పెడుతూనే విసుగ్గా గొణుక్కుంది వేదవతి. ఆ వ్యక్తివేపు అసహ్యంతోనూ, కోపంగానూ చూసి, చరచరా కర్టెను తొలగించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

చేతిలోని పాకెట్సు టేబులు మీదికి విసిరేసి, 'అమ్మా.. అమ్మా!' అని పిలిచింది.

'ఇక్కడున్నానే, చిన్నా... ఏమిటా గావు కేకలు? చెయ్యి ఖాళీ లేదు... నువ్వే ఇలా రా'. కిచెన్‌లో నుంచి తల్లి జవాబిచ్చింది.

వేదవతి అటువేపు వెళ్ళింది.

మధు కూడా అక్కడే ఉన్నాడు.

'షాపింగ్ అయిపోయిందా, చిన్నా?' నవ్వుతూ అడిగాడు. చెల్లి ముఖం ఎందుకో ధుమధుమాలాడిపోతూంది. టెన్నిసు ఆటకు వెళ్ళిపోతూ తనతో షాపింగ్‌కు రాకపోయినందుకు కోపం వచ్చింది కాబోలు. లేకపోతే నచ్చిన చీర దొరకలేదో!

'ఆఁ!' విసుగ్గా నిట్టూర్చింది వేదవతి.

గాస్ స్టౌ మీద పెనం పెట్టి పెసరట్లు పోస్తూంది తల్లి. మధు ఒక్కొక్కటే వేడి వేడిగా తింటున్నాడు.

'ఆ మనిషిని చూశారా?' వేదవతి కోపం పెసరట్లని చూసికూడా చల్లారలేదు. రెండు అట్లు ప్లేటులో పెట్టి కూతురు చేతికి అందిస్తూ, 'ఏ మనిషే బాబూ?' అనడిగింది రుక్మిణమ్మ.

'ఇంకెవరమ్మా... నాన్న అనే కామధేనువు పాలు కడుపు నిండా తాగిపోదామని వచ్చి.'

'ఓహో!... డ్రాయింగ్ రూమ్ దగ్గర బెంచీ మీద కూర్చున్న ముసలాయనా!' మధు కట్ చేస్తూ అడిగాడు.

'ఆఁ.. అతనే.. ఆ బెంచీ ఒకటిపాడు... నాన్న ఎంత చెప్పినా వినిపించుకోరు.. డ్రాయింగ్ రూమ్ బయట ఆ బెంచీ ఎందుకో.. పనికిమాలిన వాళ్ళందరూ వచ్చి దాని మీద చతికిలబడి గోడకి ఇంత తల జిడ్డు పట్టించటానికి తప్ప?'

'ఛా! ఏం మాటలు, చిన్నా... గట్టిగా అరవకు అతను వింటే బాగుంటుందా?' మందలించింది తల్లి.

'అవును మరి.. అన్నయ్యా! అక్కడెందుకూ ఆయన కూర్చోవటం? వెళ్ళి సాదరంగా ఆహ్వానించి డ్రాయింగ్ రూమ్ సోఫా మీద కూర్చోపెట్టు కాళ్ళు పైకెత్తుకుని కూర్చుని కాస్త సోఫా కవర్లయినా పాడు చేస్తాడు.' ఉక్రోషంగా అంది వేదవతి.

'పెసరట్లు బాగున్నాయర్రా?'

మాట తప్పించడానికి తల్లి అలా అడిగేసరికి వేదవతికి చప్పున నవ్వు వచ్చింది. నవ్వేస్తూ అంది. 'మా అమ్మ చేతి వంట బాగుండక పోవడం కూడానా! నయం ఏదో సామెత చెప్పినట్టు...

'ఏం సామెతో అది?' కొంటెగా నవ్వాడు మధు.

'ఏమిటా? ఏదో లెద్దూ... ఏదో ఒకటి ఉండక పోతుందా, తరవాత రిఫర్ చేసి చెబుతాలే...'

సంభాషణ హాస్యంలోకి మళ్ళిపోవటం గమనించినట్లుగా ఆగి, 'ఇంతకీ ఎవర్రా ఆయన?' అడిగింది వేదవతి.

'భలేదానివి.. నీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు, చిన్నా!... ఏమయినా అతన్ని చూడగానే నాకూ చిరాకనిపించింది సుమా! ఆ ఆకారం చూస్తే వారం రోజులుగా ఉపవాసం చేస్తున్నట్టు.. ఆ గడ్డం, ఆ చూపు, ఆ అతుకులు వేసిన చొక్కా... డర్టీ! పైగా ఖంగుమంటూ ఆ దగ్గొకటి...'

రుక్మిణమ్మ ఏమీ మాట్లాడటం లేదు కానీ, వాళ్ళ సంభాషణని ఆమోదించడం లేదని మాత్రం ఆమె ముఖమే చెబుతూంది. అది గమనించి అన్నాచెల్లెలిద్దరూ అట్లు తినటం ముగించి మధ్య గదిలోకి వచ్చారు.

'నాన్నకి చెప్పాలి, చిన్నా! ఇలా ప్రతి వాళ్ళకీ అలుసు ఇవ్వకూడదని...''ఇచ్చట ఎల్లరకూ సహాయసహకారములు అందించబడును'' అని బోర్డు తగిలించుకుని కూర్చున్నట్టు చేబదులుకో, చందాలకో, రికమెండేషన్లకో వచ్చి మీద పడిపోతూ ఉంటే ఎలా? ఎక్కడో చిన్న పరిచయం ఉంటే చాలు ఆశ్రిత మందారం అనుకుంటారో ఏమో, ఇంటికొచ్చేయటం... న్యూసెన్స్.. ఇట్స్ వెరీ బాడ్' బయట కూర్చున్నాయనకి వినిపించాలని కాస్త గట్టిగానే అన్నట్లున్నాడు మధు.

అతనికి వినిపించిందో, లేదో--

ఖంగుమని దగ్గుతూ ఆయాసపడిపోతున్నాడు. ఆ దగ్గు వినలేక వేదవతి వెళ్ళి రికార్డు ప్లేయర్ ఆన్ చేసింది. ఘంటసాల హిట్స్ ఉన్న ఎల్.పి. రికార్డు అది. అదంటే వేదవతికి చెప్పలేనంత ఇష్టం. ముసలాయన దగ్గు పాట శబ్దంతో కలిసి వికారంగా తోచింది.

'ఛీ ఛీ!' అనుకుంది వేదవతి. పాట ఆపేసింది. మధుకి కూడా చికాకు ఎక్కువయిపోతూంది. విసుగ్గా వెళ్ళి బుక్‌షెల్ఫ్‌లో నుంచి విలియం సారోయిన్ నవల ''బాయిస్ అండ్ గర్ల్స్ టుగెదర్'' తీశాడు. మనసు పుస్తకం మీద నిలపటం లేదు.

ముసలాయన దగ్గు వినటానికి కటువుగా ఉంది. ఒళ్ళు జలదరించుకుపోతున్నది. ''అంతలా దగ్గుతూ ఇక్కడ పడిగాపులు పడే బదులు ధర్మాసుపత్రికి పోయి మందు తెచ్చుకోరాదూ?'' అనుకున్నాడు మధు. ఆ కోపంలో జాలికూడా లేకపోలేదు.

'బాబూ...' ముసలాయన జీర గొంతు వినిపించింది, గరుకు నేల మీద డబ్బా రేకుతో గీసినట్టు.

'కొంచెం మంచినీళ్ళు ఇప్పిస్తారా?'

మధు మాట్లాడకుండా ఇంట్లోకి వచ్చాడు. 'ముసలాయనకి సేవలుకూడానా, అన్నయ్యా?' వేదవతి వెటకారంగా అంది. ఆ దగ్గు విని ఆమెకి బాధగానే ఉంది. దానితో ఆమెలో అసహనం మరింత ఎక్కువయిపోతోంది. నీళ్ళు పట్టుకెళ్ళి ఇమ్మని చెల్లెల్ని పురమాయించి, తను నవల అందుకున్నాడు మధు. వేదవతి పనిమనిషిని కేకేసి, 'అమ్మనడిగి నీళ్ళు చెంబుతో తీసి కెళ్ళి ఇవ్వవే అని చెప్పింది. పనిమనిషి సిల్వరు చెంబుతో రుక్మిణమ్మగారి దగ్గరికి వెళ్ళింది.

'ఎవరికే నీళ్ళు...?

'వీధిలో ఉన్నాయన కమ్మా... సిన్నమ్మగారు ఒట్టుకెళ్ళమన్నారు...'

'అయితే, ఈ చెంబుతో తీసికెళతావా బుద్ధి లేదుటే నీకు? అది చెప్పటానికీ బాగుంది, నువ్వు చెయ్యటానికీ బాగుంది. ఆయనెవరో, ఏమిటో... బాగుంటుందా?' అని కసిరి, స్టీలు చెంబుతో నీళ్ళూ, తాగటానికి గ్లాసూ అందించిందావిడ.

అది గమనించి వేదవతి మరేం మాట్లాడకుండా బుంగమూతి పె. ట్టుకు కూర్చుంది. మంచినీళ్ళు తాగాక ముసలాయనకి కొంచెం నిమ్మళించి నట్లుంది. మరి దగ్గు వినబడటం లేదు.

'హమ్మయ్య' అనుకుని లేచి, టేప్‌రికార్డర్ మీద తను పాడి రికార్డు చేసిన, 'జూలీ... ఐ లవ్ యూ... వచ్చేవరకూ రీవైండ్ చేసి అప్పుడు ప్లే చేసింది.

'గుడ్!'ఎప్పుడు రికార్డు చేశావు, చిన్నా?' మెచ్చుకుంటూ అడిగాడు మధు.

వేదవతి అందమయిన కళ్ళు గర్వంగా మెరిశాయి. తన పాటంటే ఇంట్లో అంతా ప్రాణం పెడతారు. అన్నయ్యకి మరీనూ. మధుకి జవాబు చెప్పి, 'నిజంగా బాగుందా?' అనడిగింది. ఆత్మీయతలోను, ఆనందంలోను అనుమానాలెక్కువ మరి.

పాట పూర్తయింది. ఆ తరవాత ట్రాన్సిస్టరు నుంచి సేరుగా రికార్డు చేసిన హిందీ పాటలు కంటిన్యూ అవుతున్నాయి.

మధు లేచి బయటకు వెళ్ళాడు. 'ఎవరి కోసమండీ?' ముసలాయన్ని అడుగుతున్నట్టున్నాడు.

'శ్రీపతిరావు గారు...'

'అవును మా నాన్నగారేలెండి.. క్లబ్బుకి వెళ్ళారు.. వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందేమో?'

ముసలాయన దగ్గు వినిపించింది.

'ఆయన వచ్చేవరకూ కూర్చుంటారా? పోనీ ఇంట్లోకి రారాదు?' మధు ప్రశ్న. అంటే పొమ్మని అర్థం. ముసలాయన జవాబు లేదు. మధుకి విసుగేసిందేమో- 'అయితే, మీ ఇష్టం. కూర్చోండి' అని లోపలికి వచ్చేశాడు.

‘ఘటం కదల్లేదా?’ నవ్వి అంది వేదవతి.

‘జిడ్డు.. నాన్నగారితో మాట్లాడితే కాని, కదిలేలా లేడు.’

‘ఎందుకు కదులుతాడు? ఆ జిడ్డు కాస్త మనకీ, పెయింట్ చేసిన గోడకీ పట్టించే వరకూ!’ జోక్ చేసినట్లుగా నవ్వింది వేదవతి.

ఇంతలో బయట మాటలు వినిపించాయి.

‘చిన్నా! మీ నాన్న వచ్చినట్లున్నారు... టీ తీసుకుని వెళ్ళి ఇవ్వమ్మా!’ ఫ్లాస్కులోని టీ కప్పులో పోసి అందించారు రుక్మిణమ్మగారు.

టీ కప్పుతో డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తూనే ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది వేదవతి. ఆ ముసలాయనా, తండ్రీ ఎదురెదురుగా సోఫాల్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మసిగుడ్డ కన్న అధ్వాన్నంగా ఉన్న అతని సంచి పక్కనే ఉంది. వేదవతికి చిర్రెత్తు కొచ్చింది. ఎంతో మోజుపడి అందంగా ఉంటాయని తను స్వయంగా కుట్టినవి ఆ సోఫా కవర్లు. అవి చెక్కు చెదిరితే తనకు నచ్చదు.

తండ్రి చేతికి కప్పు అందించింది ఆయన దాన్ని ముసలాయనకి అందిస్తూ, ‘తీసుకోండి, మాస్టారూ!’ అన్నారు.

‘ఫరవాలేదు, బాబూ... నువ్వు తీసుకో ముందు.’

‘అహఁ! మీరు తీసుకోండి...’ అంటూ, ‘మా అమ్మాయి వేదవతి’ అని కుమార్తెను పరిచయం చేశారు.

‘అలాగా, బాబూ! ఏదీ పార్వతీపురం వదిలేశాక నిన్ను చూడ్డం మళ్ళీ ఇదే కదా!’

‘అవును, మాస్టారూ.. యాదృచ్ఛికంగా నిన్న కలిశాం కానీ, ఈ మహాపట్నంలో అది సాధ్యమా? ఆ ఊరు వదిలి వచ్చేసరికి నాకింకా పెళ్ళి కూడా కాలేదు. ఇన్నాళ్ళకి మిమ్మల్ని చూడ్డం నాకెంత ఆనందంగా ఉందో చెప్పలేను .. మా ఇంట ఓ నాలుగురోజులు ఉండమంటే వీలవదంటున్నారు...’

అతని కళ్ళలో ఎందుకో గిర్రున నీళ్ళు తిరిగాయి.

‘నీకు తెలీదు, బాబూ! అసలే జబ్బు మనిషిని... మీ చేత అనవసరంగా చాకిరీ చేయించుకోలేను... అదీకాక రేపు ఉదయం బండికి పోవాలి కూడానూ.

‘ఛా! చాకిరీ ఏమిటి, మాస్టారూ? పోనీ కనీసం ఈ పూట భోజనానికయినా ఉండండి...’

తండ్రి మాటలలో ప్రార్థనాపూర్వకమైన ఆ అభ్యర్థనని విని వేదవతి కొంచెం చలించింది. తన అతని గురించి తక్కువ అంచనా కట్టింది. ఎంత పొరపాటయింది! నాన్నకి తెలుస్తే ఏమనుకుంటారు. నాన్న మాటలు బట్టి చూస్తే అతనికి బాగా తెలిసిన వ్యక్తిలా ఉన్నారు.

‘లేదు, బాబూ... నేను రాత్రి పూట ఏమీ తీసుకోను.. ఏమీ అనుకోకు...’ అతను వారించాడు.

వాళ్ళు తిరిగి మాటల్లో పడ్డారు. వేదవతి మరో కప్పుతో తండ్రికి టీ ఇచ్చి, టీ తాగటం పూర్తి చేశాక

కష్టంతో ఇంట్లోకి వెళ్ళిపోయింది.

మరో అరగంట గడిచాక తండ్రి అతనికి ఇల్లంత చూ ంచి అన్నారూ, తల్లినీ పరిచయం చెయ్యటం. కనుసించీ గమనించనట్లు ఊరుకుంది. ఆ తరవాత పర్సు తెరిచి వందరూపాయలు అయనకిచ్చారు...

'రక్షించావు, నాయనా! నువ్వు కనిపించకపోతే తిరిగి మన ఊరు వెళ్ళేందుకు ఛార్జీలు కూడా లేక య్యేవాడినో...' అతని కంఠంలో కృతజ్ఞతాభావం.

'అదేం మాట, మాస్టారూ, మీ ఋణం ఎలా తీర్చుకోగలం చెప్పండి?'

నాన్న వీధి వరకూ వెళ్ళి ఆయన్ని సాగనంపి వచ్చాక, మధు తలపైకెత్తి చూసి పుస్తకం పక్కన తూ అన్నాడు 'ఎవరు, నాన్నా, అది? డబ్బు సర్దినట్టున్నారు? ఎంతిచ్చారు? మీ కొసలు ప్రతి వాళ్ళ మొగమాటం జాస్తి, నాన్నా!' తండ్రి దగ్గర మధుకి చనువు ఎక్కువ.

ఆయన నవ్వేసి డ్రస్ మార్చుకుని బాత్‌రూమ్ వేపు దారి తీశారు. మధు చిన్నబుచ్చుకున్నాడు.

స్నానం చేసి వచ్చి ఈజీఛెయిర్‌లో కూర్చుని సిగరెట్ ముట్టిస్తున్న తండ్రిని చూసి మళ్ళీ అడిగాడు. వతారం చూస్తే ఇచ్చిన డబ్బు తిరిగి వచ్చేలా లేదు, నాన్నా! మనకేమీ మురిగిపోవటం లేదు కదా ' మధు గొంతులో పట్టుదల స్పష్టంగా కనిపిస్తోంది. తండ్రి ధారాళంగా ఖర్చు చేసే మనిషి అనీ, తని చేత మానిపించాలనీ అతని పంతం.

'నిజమే, మధూ! ఇచ్చిన డబ్బు ఆయన దగ్గర నుంచి వస్తుందనీ, రాబట్టుకోవాలనీ నేననుకోవటం కాని, మన కుటుంబం ఆయనకి ఎంత ఋణపడి ఉన్నామో నీకు తెలీదు.. తెలిస్తే ముక్కూ మొహం వ్యక్తి గురించి ఇలా పరుషంగా మాట్లాడి ఉండేవాడివి కావు!'

తండ్రి మాటలతో గతుక్కుమంది వేదవతి. మధు సంగతి సరేసరి.

సిగరెట్ పీలుస్తూ క్షణం ఆగి అన్నారాయన. 'ఈవేళ మనం ఇలా ఉన్నామంటే అదంతా ఆయన , మధూ!

ఆ అమృత హృదయుని దయాభిక్ష వల్లే నేనింత వాణ్ణి కాగలిగాను.. నా చిన్నప్పుడే మీ తాతగారూ, నమ్మా పోయారు. నేను మా బాబాయి, పిన్ని వద్ద పెరిగాను. నే నింకా ఏదో తరగతి లోకి డానే బాబాయి పోయారు. ఆయన బతికి ఉండగానే అనవసరపు కావేషాలతో కోర్టులకు ఎక్కడం న్న కాస్తంత ఇల్లూ, పొలమూకూడా పోయాయి.. బాబాయి పోయాక ఏడాది తిరక్కుండా కూడా నన్ను ఏకాకిని చేసేసి పోయింది. అప్పట్లో నన్ను ఆదుకుని కాపాడిన దెవరో తెలుసా! ఈ స్టారే, మధూ! వారికి అప్పట్లో బాగా ఆస్తి ఉండేది. ఆయుర్వేద వైద్యం చేస్తూ, ఆ మందులు అమ్ముతూ గడించారు. పిత్రార్జితమయిన ఆస్తికూడా బాగానే ఉండేది. మాస్టారికీ, వారి భార్య శ్రీదేవిగారికీ చేతికి ఎముక లేదనిపిస్తుంది. బీదపిల్లలంటే ఎంత దయ చూపించే వారో చెప్పలేను.. మాస్టారే వారాలు ఏర్పాటు చేశారు. వారంలో మూడు రోజులు వారింట్లోనే భోజనం. నా బట్టలూ, కాలూ ఒక్కటేమిటి? నా వనుకునే సమస్తం మాస్టారి దయాభిక్ష! ఒక్క మాటలో- నా జీవితానికి టు మాస్టారే! అతని ఋణం ఎలా తీర్చుకోగలను?' తండ్రి గొంతు ఆర్ద్రతతో వణికిపోయింది.

వేదవతి పశ్చాత్తాపంతో కరిగిపోయింది. మధు సిగ్గుతో తలఎత్తలేకపోయాడు. 'క్షమించండి, నాన్నా! తెలిసి తక్కువగా ఏదో అనేశాను... అంతటి పుణ్యమూర్తిని ఎంత తక్కువగా ఊహించాను? ఇంతకీ మాస్టారి పరిస్థితి ఇప్పుడింతగా దిగజారిపోయిందేం, నాన్నగారూ?'.

ఆయన నిట్టూర్చి అన్నారు. 'అంతే, మధూ! కాలం చాలా చిత్రమయింది. అది ఎవరి జీవితాలలో ఎప్పుడెలాటి ప్రతాపం చూపిస్తుందో తెలీదు. కూతుళ్ళ పెళ్ళిళ్ళూ, చదువులూ, భార్య జబ్బు, కోర్ట వ్యాజ్యాలూ, ఎన్నో చిక్కులు ఆయన్ని పీల్చి పిప్పి చేశాయట... నిన్న అనుకోకుండా హాస్పిటల్‌కి డాక్టర్ సురేంద్రతో మీటింగ్ విషయం ఒకటి మాట్లాడదామని వెళితే అక్కడ కలిశారు.. అల్లుడు ఏదో యాక్సిడెంట్ జరిగి హాస్పిటల్‌లో చేరాడు. అతనికి ఈ ఊళ్ళోనే ఏదో చిన్న ఉద్యోగం.. టెలిగ్రామ్ వస్తే మాస్టారు వచ్చారు .. ఖర్చుల్లో ఉన్నారని చెప్పి డబ్బు ఇద్దామనుకుంటే ఓ పట్టాన తీసుకోలేదు... ఎంత ఆత్మాభిమానం కలమనిషి అనుకున్నావు? ఎడ్రసు ఇచ్చాను. క్లబ్బు నుంచి వచ్చాక స్నానం చేసి నేనే కారులో వెళ్ళి తీసుకొద్దామనుకున్నాను... ఇంటి కొచ్చేసరికి బెంచీ మీద కూర్చుని ఆయనే కనిపించారు.'

మధు బాధగా నిట్టూర్చాడు. వేదవతి మనసు బాధతో, పశ్చాత్తాపంతో బరువెక్కిపోయింది.

* * *

ఆ రాత్రి వేదవతి తన డైరీలో ఇలా వ్రాసుకుంది. 'ఇవాళ ఎంత మూర్ఖంగా ప్రవర్తించాను?... నా ప్రవర్తన నాకే సిగ్గనిపించింది. మాస్టార్ని గురించి ఎంత నీచంగా ఆలోచించాడు. ఆ దయామయుని పట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించానని! ఛీ ఏం మనిషిని నేను! ఏ వ్యక్తిని గురించికూడా ఇక ముందు పూర్తిగ తెలీకుండా అంచనా కట్టకూడదు.' అసలు ఇంకో వ్యక్తిని తక్కువ అంచనా కట్టే అధికారం నాకెవరిచ్చారు; నాన్న క్షమిస్తారా నన్ను?...' మధుకూడా బరువెక్కిన గుండెతో దాదాపు ఇలాగే తన డైరీలో వ్రాసుకున్నాడు.

'మాస్టారు వచ్చారు... మనిషి ఎంత నీరసించిపోయారు! అసలు ఒంట్లో రక్తం ఉందా అనిపిస్తుంది... పాపం ... మాస్టారి స్థితిలో అప్పటికీ, ఇప్పటికీ రవ్వంతకూడా మార్పు లేదు... నా చిన్ననాట ఎంత దారిద్ర్యాన్ని అనుభవించారో, ఇప్పుడూ అంతే! అదే స్థితి. అవే కష్టాలు, కన్నీళ్ళు బాధలు. ఈ వ్యక్తి బాధలు అనుభవించటానికే పుట్టారా! అనిపిస్తూ ఉంటుంది... మాస్టారు అ ఆలు నా చేత దిద్దించిన ఆ చేతితో ఎంత చల్లగా దీవించారో! ఈ పేళ నేనింతవాణ్ణి కాగలిగాను... ఆ చెయ్యి మాత్ర కనిపించని కన్నీళ్ళు తుడుచుకోవటానికీ, చేబదుళ్ళు అడగటానికీ... మాస్టారు నిజంగా శాపగ్రస్తులనిపిస్తుంది. భగవాన్!' అని తండ్రి తన డైరీలో వ్రాసుకున్నట్లు మధుకీ, వేదవతికీ తెలీదు.

ఎలా తెలుస్తుంది!

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక. 7.1.1976)